తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాద్రాద్రి భువనగిరి
గురువారం 14 మే 2026
పేజీలు : 8



## మొక్కజొన్న రైతుకు ఊరట..

- మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలి
- రవాణా, గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి
- మొక్కజొన్న కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ అంకిత్ క్షేత్రస్థాయి పరిశీలన
- రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ అంకిత్



# రంగంలోకి దిగిన జిల్లా కలెక్టర్

**టేకులపల్లి, మే 13(జనంసాక్షి):** జిల్లాలోమొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని ఇల్లందు వ్యవసాయ కమిటీ, చల్లసముద్రం, టేకులపల్లి, బోడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి కొనుగోలు, నిల్వ, లోడింగ్, రవాణా ప్రక్రియలపై సమీక్ష నిర్వహించారు. మొదటగా ఇల్లందు వ్యవసాయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, అక్కడ నిల్వ ఉంచిన మొక్క జొన్న బ్యాగులు, కొనుగోలు వివరాలు, గోదాముల సామర్థ్యం, హమాలీల అందుబాటు తదితర అంశాల పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కేంద్రంలో 54 వేల మొక్కజొన్న బ్యాగులు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయ కమిటీ ప్రాంగణంలోని గోదాముల్లో సుమారు 3 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్నట్లు అధికారులు వివరించారు.లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు గాను స్థానిక కూలీల ద్వారా అదనపు లోడింగ్ పనులు చేపడుతున్నామని అధికారులు కలెక్టర్‌కు తెలియజేయగా, రోజువారీ చెల్లింపులు వెంటనే చేపట్టి లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.రైతులతో మాట్లాడి సమస్యల ను అడిగి తెలుసుకున్న కలెక్టర్, నిల్వ స్థలాల కొరత నివారణకు గిరిజన భవనాలు, కళాశాలల ఫంక్షన్ హాల్స్ వంటి ప్రత్యామ్నాయ ప్రదేశాలను గుర్తించి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.రవాణా ప్రక్రియ వేగవంతం చేసేందుకు ట్రాక్టర్లు, డీసీఎంలను కూడా వినియోగించుకోవాలని సూచించిన కలెక్టర్, రెండు రోజుల్లో లోడింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

మిగతా 2లో

## ప్రభుత్వ విద్యాసంస్థల పరిరక్షణకు ప్రతి సర్పంచ్ చేయాలి

- గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు
- ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకునే బాధ్యత సర్పంచులదే
- ప్రభుత్వ పాఠశాలలో చేరండి- భవితకు బంగారు బాట వేయండి

**దేవరకొండ,మే 13(జనంసాక్షి)** ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కూడా అభివృద్ధి చెందుతున్నాయని దేవరకొండ సర్పంచుల పూర్వ అధ్యక్షులు కొర్ర రామ్ సింగ్ అన్నారు. బుధవారం స్థానిక మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా డివిజన్ పరిధిలోని సర్పంచుల ఫోరం వర్క్ షాప్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విద్యాసంస్థల పరిరక్షణకు మనమంతా కృషి చేయాలని,గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని అన్నారు. గ్రామాలలోని ప్రభుత్వ విద్యాసంస్థలను పరిరక్షించాలని, అందుకు గ్రామ సర్పంచులే ప్రజలలో అవగాహన కల్పించి ప్రభుత్వ బడులలో విద్యార్థులు చేరే విధంగా అందరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం కళాశాల ఎన్రోల్మెంట్ బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ రామావత్ రవి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా దేవరకొండ డివిజన్లోని అన్ని సర్పంచులు మా కళాశాలను సందర్శించి మా కళాశాల అడ్మిషన్ బ్రోచర్ను ఆవిష్కరించడం, ప్రభుత్వ విద్యాసంస్థలను పరిరక్షించాలని తీర్మానం చేయడం ఎంతో ఆనందకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు కొర్ర రామ్ సింగ్ నాయక్, ఎంపీడీవో డానియల్,వివిధ మండలాల ఎంఈఓ లు, వివిధ గ్రామాల సర్పంచులు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.కోటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ సి.లింగమయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి.లింగారెడ్డి తదితర కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



## లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉండాలి

### ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి, పలు సూచనలు చేసిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**హుజూర్ నగర్ మే 13 (జనంసాక్షి):** ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఎలాంటి అవకతవకలు లేకుండా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.బుధవారం హుజూర్ నగర్ లోని రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్న నేపథ్యంలో రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని, ఎలక్ట్రిసిటీ, స్ట్రీట్ లైట్, గ్రీనరీ, త్రాగునీరు, పైలాన్ స్తూపం పనులను కలెక్టర్ పరిశీలించి మిగిలి పోయిన పనులను త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని, వేసవికాలంలో ఎండలు ఎక్కువగా ఉన్నందు వలన గ్రీనరీలో నాటిన మొక్కలకు నీరు అందించి మొక్కలు ఎండిపోకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, మిషన్ భగీరథ ఈఈ అరుణాకర్ రెడ్డి, తహసిల్దార్ కవిత, సంబంధిత శాఖల అధికారులు, గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.



# మొక్కజొన్న రైతుకు ఊరట.. రంగంలోకి దిగిన జిల్లా కలెక్టర్

అనంతరం రేపల్లెవాడలోని చల్లసముద్రం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. రైతులు సరిపడా లారీలు అందు బాటులో లేకపోవడం, గన్ని బ్యాగుల కొరత కార ణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన కలెక్టర్ జిల్లా రవాణా శాఖ అధికారులతో మాట్లాడి తగి నన్ని లారీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే గన్ని బ్యాగుల కొరతపై డీఎం మార్క్ఫెడ్ అధికారులతో మాట్లాడి వెంటనే 50 వేల గన్ని బ్యాగులు సరఫరా చేయాలని సూచించారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో 17 వేల మొక్క జొన్న బ్యాగులు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.కొమరారం కొనుగోలు కేంద్రంలోని నిల్వలను కూడా కారేపల్లి గోదాములకు తరలిస్తు న్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కారేపల్లిలో 5 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం అందుబాటులో ఉన్నందు న అక్కడ నిల్వలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.టేకులపల్లి మండలంలో పర్యటించిన కలెక్టర్ టేకులపల్లి వ్యవసాయ కమిటీ మొక్కజొన్న కొనుగోలు కేం ద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కొను గోలు కేంద్రంలోని మొక్కజొన్న నిల్వలు, రవాణా సదుపాయాలు, హమాలీల అందుబాటు, గోదా ముల పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కేంద్రంలో సుమారు 1,50,000 మొక్కజొన్న బ్యాగులు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు సూర్యాపేట జిల్లా కోదాడ మార్కెట్ యార్డుకు మొక్కజొన్న తరలిస్తున్నట్లు వివరించారు.ప్రత్యామ్నాయ నిల్వల కోసం టేకులపల్లి ఉన్నత పాఠశాలలో తాత్కాలిక నిల్వలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా పెట్రాల చిలక గ్రామంలో సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌కు చెందిన రెండు గోదాములు ఉండగా,వాటికి 10 వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్నట్లు వివరిం చారు. వెంటనే ఆ గోదాములను వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన అనుమతులు పొందాలని, తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.కొనుగోలు కేంద్రంలో ప్రస్తుతం 148 మంది హమాలీలు అందు బాటులో ఉన్నా రని అధికారులు తెలపగా, రవాణా కోసం తగి నన్ని లారీలు ఏర్పాటు చేసి నిల్వల తరలింపును వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం బోడు మొక్కజొన్న కొనుగోలు కేం ద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో సుమారు 6 వేల మొక్కజొన్న బ్యాగులు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. రవాణా ప్రక్రియపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, తగినన్ని లారీలు ఏర్పాటు చేయాలని ఆదేశిం చారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్,గత మూడు రోజులు గా ట్రాక్టర్లతో కొనుగోలు కేంద్రం వద్ద వేచి ఉన్నామని రైతులు తెలియజేయగా, వెంటనే స్పందించి ట్రాక్టర్లలో ఉన్న మొక్కజొన్నను కొత్త గూడెం మార్కెట్ యార్డుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా తగినన్ని గన్ని బ్యాగులు సరఫరా చేయాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు నిరంతరం కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంటూ కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, రవాణా, గన్ని బ్యాగు లు, హమాలీల కొరత లేకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, మార్కెటింగ్ అధికారి నరేందర్, తాసిల్దార్లు, ఎంపీడీవోలు, కొనుగోలు కేంద్రాల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో విద్యా వారోత్సవాలు

**ఖమ్మం రూరల్, మే 13 (జనంసాక్షి)**

ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల విద్యా వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఎంఈఓ ఎ. శ్రీనివాస్ చే ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.బుధవారం ఎంపీడీఓ కార్యాలయం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు ప్రభుత్వ విద్యా కార్యక్రమాలపై సమగ్ర అవగాహన కల్పించారు.సదస్సులో ముఖ్యంగా ఏపీసీ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ విధులు, బాధ్యతలపై వివరించారు. అలాగే బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల నమోదు పెంపు, అకాడమిక్ ఇనిషియేటివ్స్, స్టెమ్ ఎడ్యుకేషన్, ఎక్సెల్, అసెప్, కేజీబీవీ ఇనిస్టిట్యూషన్స్ ఆఫ్ ఎక్సలెన్స్ వంటి అంశాలపై చర్చించారు.అదేవిధంగా ఫ్రీ ప్రైమరీ ప్రోగ్రాం, విద్యార్థులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్రేక్‌ఫాస్ట్ పథకం, రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న విద్యార్థి కిట్లు, పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పి. అనిత, ఎంపీడీవో కె. రవికుమార్, ఎంపివో శ్రీదేవి, సర్పంచులు, కౌన్సిలర్లు, కాంప్లెక్స్ హెచ్ఎంలు ఎం. శ్యాంసన్, శాంతి సుధా, సరళ, జి.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, సీసీఓ, ఎంఐఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**నూతన వధూ వరులను ఆశీర్వదించిన నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల్ భగత్**

**హాలియా మే 13 జనంసాక్షి**

అనుముల మండలం పేరూరు గ్రామానికి చెందిన అర్కపల్లి ఆంజనేయులు (సిఆర్ఐ) గారి ఉషా గార్డెన్లోసోదరుని కుమారుని వివాహ వేడుకలో పాల్గొన్న నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల్ భగత్ కుమార్ గారు నూతన వధూ వరులను ఆశీర్వదించారు.ఈ శుభప్రద కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సాదం సంపత్ కుమార్, కూరాకుల వెంకటేశ్వర్లు, సురభి రాంబాబు, రాయణబోయునా రామలింగయ్య, యడవల్లి నాగరాజు, సిగలంబట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రాబోయేది మన ప్రభుత్వమే..

### కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టండి: సీనియర్ నేతల పిలుపు

**గుర్రంపోడు, మే 13 (జనంసాక్షి)**



గుర్రంపోడు మండల కేంద్రంలో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నూతన కార్యాలయాన్ని బుధవారం పార్టీ సీనియర్ నాయకులు ఘనంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని తెరిచిన అనంతరం నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ నాయకులు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో తెలంగాణలో మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో, నిబద్ధతతో కృషి చేయాలని పిలుపునిచ్చారు .క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు.త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు.ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసి తన సత్తా చాటాలని నేతలు ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు మరియు భారీ సంఖ్యలో గులాబీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పశువుల అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

○ టేకులపల్లి ఎస్సై రాజేందర్ ○ఐదుగురిపై బైండోవర్ కేసు

**టేకులపల్లి,మే 13(జనంసాక్షి):**



పశువుల అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని టేకులపల్లి ఎస్సై రాజేందర్ హెచ్చరించారు. బుధవారం టేకులపల్లి పోలీస్ స్టేషన్లో ఎస్ఐ ఆలకుంట రాజేందర్ ఆధ్వర్యంలో పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వారిని గుర్తించి ఐదుగురిపై బైండోవర్ కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. బక్రీద్ సందర్భంగా పశువుల అక్రమ రవాణా చేయవద్దని, ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు. ఎవరైనా పశువుల అక్రమ వధకు పాల్పడితే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. పశు వుల అక్రమ రవాణా చేస్తే ఊర్లో ఉన్నటువంటి ప్రతి ఒక్కరు పోలీసులకు 100 నెంబర్కు డయల్ చేసి సమాచారం ఇవ్వగలరుని వారు తెలిపారు. చిన్న సంఘటన జరిగినా పోలీసులకు, దయ ల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో టేకులపల్లి ఎస్సై రాజేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం :ఎమ్మెల్యే కుంభం

**వలిగొండ, మే 13 (జనంసాక్షి)**



పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మండలానికి చెందిన కొండూరు స్వాతి నగేష్ నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పది సంవత్సరాల నుండి ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.అనంతరం ఎఫ్ ఎస్ సి ఎ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్ర కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మే 15వ గ్రామీణ సమ్మెను జయప్రదం చేయండి

### ములకలపల్లి రాములు పిలుపు

**మునగాల, మే 13(జనంసాక్షి):**



మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి చట్టరక్షణకు ఉపాధి కూలీలందరూ ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు బుధవారం మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశానికి సందర్శించిన అనంతరం ఆయన కూలీలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ, కేంద్రంలో మోడీ సర్కార్ పేదలకు వరంలాంటి చట్టాన్ని తీసివేసి జీరాంజీ పేరుతో పేదలకు మోసం చేసే పథకాన్ని తీసుకొచ్చాడని ఆయన విమర్శించారు. ఉపాధి హామీ చట్టంలో కూలీల దగ్గర రెండు ఫోటోల పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టెంట్లు మంచినీరు సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్ట రక్షణకు మే 15న జరిగే గ్రామీణ బందులో ప్రజ లందరూ పాల్గొనా లని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు షేక్ సైదా గ్రామ సర్పంచ్ బొల్లం యమున లింగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఆర్. రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు అమరగాని కనకయ్య, వీరబోయి వెంకన్న, వెంపటి వీరబ్రహ్మం, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు షేక్ ఖాజాబీ, వెంపటి మైసయ్య, రైతు సంఘం నాయకులు నీలారపు కొమరయ్య, చీమ శ్రీనివాస్, సిఐటియు నాయకులు షేక్ నబి సాహెబ్, అమరగాని లక్ష్మి, వెంబటి నిర్మల, జిల్లేపల్లి ఎల్లమ్మ, బొల్లం శ్రీదేవి, కాగితాల నాగమణి, వెంపటి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# డాక్టరేట్ సాధించిన గోళ్లపాడు యువకుడు



**ఖమ్మం రూరల్, మే 13 (జనంసాక్షి):**
ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామానికి చెందిన మందడి సంజీవరెడ్డి గణిత శాస్త్రంలో డాక్టరేట్ పట్టా సాధించారు. హైదరాబాద్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో గణిత శాస్త్ర విభాగంలో డా. ఎం. అనిల్ కుమార్ పర్యవేక్షణలో పరిశోధనలు నిర్వహించి "హీట్ అండ్ మాస్ ట్రాన్స్ఫర్ ఫెనోమేనా ఇన్ ఎం హెచ్ డి నాన్ -న్యూటనియన్ ఫ్లూయిడ్స్ ఓవర్ స్ట్రెచింగ్ /ష్రింకింగ్" షీట్స్ అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు.విశ్వవిద్యాలయ నిపుణుల కమిటీ సూచనల మేరకు సంజీవరెడ్డిని డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పిహెచ్.డి.) పట్టాకు అర్హుడిగా ప్రకటించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, స్నేహితులు మరియు అధ్యాపకులు ఆయనను అభినందించారు. సంజీవరెడ్డి మాట్లాడుతూ, తన విజయంలో తల్లిదండ్రులు, గురువులు మరియు పరిశోధన మార్గదర్శకుడు డా. ఎం. అనిల్ కుమార్ ప్రోత్సాహం ఎంతో కీలకమని తెలిపారు. భవిష్యత్తులో పరిశోధన మరియు బోధన రంగాల్లో మరింత సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ





**ఖమ్మం టౌన్ , మే 13 (జనంసాక్షి):**
రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సిఫారసు మేరకు ప్రభుత్వం నుంచి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను బుధవారం ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బాధితులకు అందజేశారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఖమ్మం నగరంలోని బుర్హాన్‌పురంకు చెందిన శెట్టి ప్రవీణ్ కుమార్, ఇల్లెందు మండలం కట్టుగూడెం గ్రామానికి చెందిన రామలింగాచారి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారి దరఖాస్తులను పరిశీలించిన ప్రభుత్వం రూ. 1,08,000 విలువైన ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. ఈ మేరకు ఎంపీ రవిచంద్ర వ్యక్తిగత సహాయకుడు సయ్యద్ ఇస్మాయిల్ బాధితులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు తమకు ఆర్థిక భరోసా కల్పించిన ముఖ్యమంత్రి, ఎంపీ రవిచంద్రలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందని వారు పేర్కొన్నారు.

# పంట అవశేషాల దహనం నివారణపై రైతులకు అవగాహన

## పర్యావరణ పరిరక్షణలో రైతులు భాగస్వాములు కావాలి : మండల వ్యవసాయ అధికారి సోములపల్లి మానస



**చింతకాని, మే 13 (జనంసాక్షి)**
వ్యవసాయ భూముల్లో పంట కోత అనంతరం మిగిలే వరి గడ్డి, మొక్కజొన్న కాండాలు మరియు ఇతర పంట అవశేషాలను కాల్చివేయకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోములపల్లి మానస సూచించారు. పంట అవశేషాలు దహనం వల్ల పర్యావరణానికి తీవ్రమైన నష్టం జరుగుతుందని ఆమె తెలిపారు.పంట అవశేషాలను కాల్చడం వల్ల గాలి కాలుష్యం అధికమవడంతో పాటు నేలలో ఉండే సేంద్రియ పదార్థాలు, ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశిస్తాయని పేర్కొన్నారు. దీని ప్రభావం భూమి సారంపై పడటంతో భవిష్యత్తులో పంట దిగుబడులు కూడా తగ్గే ప్రమాదం ఉందన్నారు. అదేవిధంగా పొగ కారణంగా ప్రజలు శ్వాసకోశ సమస్యలు, కంటి ఇబ్బందులు వంటి ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనే అవకాశముందని తెలిపారు.రైతులు పంట అవశేషాలను కాల్చకుండా వాటిని నేలలో కలిపి సేంద్రియ ఎరువులుగా వినియోగించుకోవాలని సూచించారు. రోటావేటర్, మల్చర్ వంటి వ్యవసాయ యంత్రాల సహాయంతో పంట అవశేషాలను సమర్థవంతంగా నిర్వహించవచ్చని చెప్పారు. ఈ విధానాలు భూమి సారాన్ని పెంచడంలో కూడాఉపయోగపడతాయని వివరించారు. పంట అవశేషాల దహనం చట్టరీత్యా నిషేధించబడిన చర్య అని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై ప్రభుత్వం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.కాబట్టి రైతులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములై శాస్త్రీయ పద్ధతులను అనుసరించి పంట అవశేషాలను కాల్చకుండా వ్యవహరించాలని మండల వ్యవసాయ అధికారి సోములపల్లి మానస విజ్ఞప్తి చేశారు.

# శాలిబండ కాలనికి మహర్దశ

### శాలిబండ కాలనీవాసులలో చిగురించిన కొత్త ఆశలు..

### సీసీ రోడ్డు, ఉప్పునీటి సౌకర్యం కొరకు బోరు మంజూరు పై సర్వత్ర హర్షం వ్యక్తం



**దేవరకొండ, మే 13 (జనంసాక్షి)**
ఇటీవలే మున్సిపల్ ఎన్నికలు పూర్తికాగా, కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. దేవరకొండ మున్సిపాలిటీలో ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని మూడో వార్డుకు నేటితో మహర్దశ కలిగింది. అన్ని కులాల,మతాల వారు ఐక్యమత్యంతో శాలిబండ కాలనీలో ఎన్నో ఏళ్లుగా జీవనం సాగిస్తూ వస్తున్నారు. అయినప్పటికీ పట్టణంలో అభివృద్ధికి నోచుకోని శాలిబండ- సమస్యల కొండగా పేరు గావించింది. స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సహకారంతో కొత్త పాలకవర్గం మూడో వార్డులో అభివృద్ధి దిశగా అడుగులు ముందుకు వేస్తుంది. నేడు ఎన్ హెచ్ 167 బీటీ రోడ్డు నుండి కదారి అంజయ్య కాలనీ గాజినగర్ బీటీ రోడ్డు వరకు సిసి రోడ్డు శంకుస్థాపన జరిగింది . శాలిబండ కాలనీలో మిషన్ భగీరథ నీరు కాకుండా బోరు వేయించి ప్రత్యామ్నాయ ఉప్పు నీటి సౌకర్యం కల్పించాలని, శిథిలావస్థకు చేరిన పాత హాస్టల్ భవనం ను తొలగించి బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలని , అంగన్వాడి కేంద్రం సొంత భవనం నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు . ముఖ్యంగా పందుల పెంపకాన్ని అరికట్టాలని, వీధి కుక్కల బెడద నుండి కాలనీ వాసులకు విముక్తి కలిగించాలని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన తమకు సంబంధమే లేనట్లు వ్యవహరిస్తున్నారు. పందుల సంచారం వల్ల పలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ఆరోగ్య దృష్ట్యా అధికారులు స్పందించి పందుల పెంపకం దారులపై తగిన చర్యలు తీసుకుని పందుల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఇకనైనా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నా శాలిబండ కాలనీలో తాగునీరు, పారిశుధ్యం, అంతర్గత రోడ్లు, వీధి దీపాల నిర్వహణ, మురుగు కాల్వల నిర్మాణాలు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే ను కాలనీ ప్రజలు కోరుతున్నారు.

# శ్రమశక్తి పురస్కార గ్రహీత కొత్త సీతారాములుకు ఘన సన్మానం

### మున్నూరుకాపులకు సముచిత ప్రాధాన్యం కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి





**ఖమ్మం టౌన్ , మే 13 (జనంసాక్షి):**
ఐఎన్టీయూసీ రాష్ట్ర నాయకులు, శ్రమశక్తి పురస్కార గ్రహీత కొత్త సీతారాములును మున్నూరుకాపు ప్రముఖులు ఘనంగా సత్కరించారు. ఖమ్మం నగరంలోని బురహాన్‌పురంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ నివాసంలో మంగళవారం రాత్రి నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమం ఆత్మీయ వాతావరణం లో జరిగింది. నగరానికి చెందిన పలువురు సామాజిక, రాజకీయ ప్రముఖులు కార్యక్రమానికి హాజరై సీతారాములుకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడిన మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, ప్రముఖులు మేకల భిక్షమయ్య, కేదాసు నర్సయ్య, కలిశెట్టి విజయ్ కుమార్, గట్టు మోహన్ రావు తదితరులు రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మున్నూరుకాపులకు తగిన రాజకీయ, సామాజిక ప్రాధాన్యం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల మంది మున్నూరుకాపులు ఉన్నప్పటికీ, కులగణనలో కేవలం 13 లక్షలుగా చూపించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర మంత్రివర్గంలో ఇప్పటివరకు మున్నూరుకాపు నాయకుడికి చోటు కల్పించకపోవడం నిరాశ కలిగించింద న్నారు. కనీసం ఒక మున్నూరుకాపు ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలని, రాష్ట్ర స్థాయిలో భర్తీ చేసే నామినేటెడ్ పోస్టుల్లో ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో కొత్త సీతారాములును శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. తనకు అందించిన గౌరవానికి సీతారాములు కృతజ్ఞతలు తెలియజేస్తూ, సమాజ అభ్యున్నతికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో ఆకుతోట రాజశేఖర్, ముత్యం కొండల్ రావు, గుండపనేని నర్సింహారావు, గుండ్లపల్లి శేషగిరిరావు, ప్రతాపనేని నాగయ్య, ముత్యాల గోవర్ధన్, గొట్టం శ్రీనివాసరావు, అన్నం వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ లక్ష్మీనారాయణ, మేకల నాగేందర్, పగడాల మోహన్ రావు, దాసరి మధు, గుండపనేని రాజా, కూరాకుల మోహన్ రావు, ద్రాక్షపల్లి రాంచందర్, లింగాల పద్మారావు, గొగం సురేష్, రామిశెట్టి తిరుపతి రావు, పద్మం వెంకటేశ్వర్లు, వాసంశెట్టి రామారావు, గడియాల మధు, కొరం ఉప్పలయ్య, ఆకుల వెంకటేశ్వర్లు, కల్లూరి సోమయ్య, కమటం అప్పారావు, ఆకుల సురేష్, నామాల అశోక్, వనం శ్రీనివాసరావు, ఉపేందర్ రావు (టీచర్), విష్ణు (పద్మా ఫ్లెక్సీ), బొమ్మిశెట్టి ఉపేందర్, పెద్దినేని శరత్, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సరోజ వృద్ధాశ్రమంనకు గృహోపకరణాలు అందజేత

## - నవ లిమిటెడ్ సహకారంతో..




**భద్రాచలం మే 13 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- నవ లిమిటెడ్ పాల్వంచ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాలలో భాగంగా బుధవారం మానవసేవ వలంటరీ ఆర్గనైజేషన్ భద్రాచలంలో సరోజ వృద్ధాశ్రమానికి వంట సామాగ్రి, పరుపులు, మంచములు, గృహోపకరణాలు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ హాజరయ్యి ఆయన మాట్లాడుతూ మానవతా దృక్పథంతో సరోజ వృద్ధాశ్రమానికి వంట సామాగ్రి, పరుపులు, మంచములు, గృహోపకరణాలు అందజేసిన నవ సి.ఎస్.ఆర్ కార్యక్రమాలను కొనియాడారు. మానవసేవ వలంటరీ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ సరోజ మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో వృద్ధుల అవసరాలను 'నవ లిమిటెడ్'మేనేజ్మెంట్ దృష్టికి తీసుకువెళ్లగా వారు తక్షణమే స్పందించి గృహోపకరణాలు వంటి సహకారాన్ని అందజేసినందుకు నవ లిమిటెడ్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. డి.జి.ఎం (ఫైనాన్స్) ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ సంస్థ సమాజాభివృద్ధికి గత 46 సంవత్సరాలుగా చేస్తున్న ఆరోగ్యం, విద్య, జీవనోపాధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి సి.ఎస్.ఆర్ మేనేజర్ సి.హెచ్ శ్రీనివాస్ రావు, శ్రావణ్, సాయి, సి ఎస్ ఆర్ సిబ్బంది, వృద్ధులు పాల్గొన్నారు.

# మధ్య దళారీ వ్యవస్థను అరికట్టాలి



## ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చెయ్యాలి బండారి ఐలయ్య

**తిరుమలాయపాలెం మే 11 (జనంసాక్షి) :** తిరుమలాయపాలెం మండలం తిప్పారెడ్డి గూడెం గ్రామంలో జిల్లా ముఖ్య కార్యకర్తల జనరల్ బడి జరిగింది. ఈ సందర్బంగా సిపిఐ(ఎంల్) న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి బండారి ఐలన్న మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న పంటకు సరైన ధర లభించడం లేదని, రైతులు మధ్య వర్తుల చేతిలో దోపిడీకి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. కనీస మద్దతు ధర (ఓూఖ) ప్రకటిం చినప్పటికీ, ఆ ధరకు కొనుగోళ్లు జరగడం లేదని, రైతులు నష్టాలతో పంటను అమ్ముకోవాల్సి వస్తోం దని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతుల నుండి నేరుగా పంట కొనుగోలు చేయాలని ఆయన కోరారు.వరి ధాన్యం కొనుగోలు విషయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని ఐలన్న విమర్శించారు. ధాన్యం తేమ శాతం పేరుతో అనవసరంగా తిరస్కరిం చడం, తూకంలో అవకతవకలు, ఆలస్యంగా చెల్లింపులు వంటి సమస్యలు రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నాయని తెలిపారు. అనేక చోట్ల కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభం కాకపోవడం వల్ల రైతులు తమ పంటను తక్కువ ధరలకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోందని అన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు వెంటనే చేయాలని, గరిష్టంగా 48 గంటలలోపు రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తేమ శాతం ప్రమాణాలను పారదర్శకంగా అమలు చేయాలని, తూకం ప్రక్రియను డిజిటల్ పద్ధతుల్లో నిర్వహిం చాలని సూచించారు. అలాగే, గోదాముల కొరత, రవాణా సమస్యల వల్ల ధాన్యం నిల్వ చేయలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి గ్రామ స్థాయిలోనే నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేసి, సరైన మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. మొక్కజొన్న మరియు వరి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేస్తామని బండారి ఐలన్న హెచ్చరించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించి, అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సిపిఐ(ఎంల్) న్యూడెమోక్రసి రాష్ట్ర నాయకులు మందుల రాజంద్ర ప్రసాద్, జిల్లా నాయకులు వెంకట రామిరెడ్డి, సురేష్, ప్రకాష్, కాశీం, మోహన్ రావు, జానకి, మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, అచ్చ ఉప్పలయ్య, నాగయ్య, వెంకటేశ్వర్లు, లల రావు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాదు పబ్లిక్ స్కూల్‌లలో ఎస్‌సి విద్యార్థులకు ప్రవేశాలు


**ఖమ్మం, (జనంసాక్షి) :**

షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు హైదరాబాదు పబ్లిక్ స్కూల్, రామాంతపూర్ మరియు బేగంపేట పాఠశాలలలో 2026?27 విద్యా సంవత్సరానికి మొదటి తరగతి ప్రవేశాల కోసం ఎస్‌సి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మం జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు గుడికందుల జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. 2019 జూన్ 1 నుంచి 2020 మే 31 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను 2026 మే 29 సాయంత్రం 5 గంటలలోపు ఖమ్మం నూతన కలెక్టరేట్‌లోని ఐడీఓసి ఎస్?34 కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. జిల్లాకు రెండు సీట్లు కేటాయించబడినట్లు తెలిపారు. అందులో రామాంతపూర్ పాఠశాలకు ఒకటి, బేగంపేట పాఠశాలకు ఒకటి చొప్పున అవకాశాలు ఉన్నాయి. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు పిల్లలు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తులతో పాటు నివాస, జనన, ఆదాయం, కుల ధృవపత్రాలు, రేషన్ కార్డు, ఆధార్ ప్రతులు సమర్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలు మించరాదని తెలిపారు. అర్హుల సంఖ్య రెండు కంటే ఎక్కువైతే 2026 జూన్ 1న ఖమ్మం నూతన కలెక్టరేట్‌లో లాటరీ విధానంలో ఎంపిక చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నేరుగా హైదరాబాదు పబ్లిక్ స్కూల్‌లలో దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు ప్రభుత్వ ఉపకార వేతనాలు వర్తించవని ఆమె స్పష్టం చేశారు.

# రైతులు మెచ్చిన పశువుల "డాక్టర్"

- టీకాలు,చికిత్సలపై అవగాహన కార్యక్రమాలు
- పశు సంవర్ధక రంగానికి అండగా డాక్టర్ సేవలు
- ప్రశంసలు కురిపిస్తున్న అన్నదాతలు




**ఖమ్మం రూరల్,మే 13 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంతాల్లో పశుసంవర్ధక రంగం రైతుల ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారంగా నిలుస్తోంది.అలాంటి పరిస్థితుల్లో పశువులకు సమయానికి వైద్యం అందించడం ఎంతో కీలకం.ఈ నేపథ్యంలో స్థానిక ప్రాంత రైతులకు అండగా నిలుస్తూ, పశువుల ఆరోగ్య పరిరక్షణలో విశేష సేవలు అందిస్తున్న ఓ పశు వైద్యుడు ప్రస్తుతం రైతుల ప్రశంసలు అందుకుంటున్నారు.

ఖమ్మం రూరల్ మండలంలోని ఎం.వెంకటాయపాలెం గ్రామంలో పశు వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్నా అజ్మీరా జగ్గూ లాలు విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ



పాఠశాలలోనే విద్యను అభ్యసించారు.ప్రాథమిక విద్య గార్ల ఒడ్డు, ఇంటర్ మీడియట్ అన్నపురెడ్డి పల్లి, బి వి ఎస్ సి అండ్ హెచ్ ఆచార్య ఎన్ జి రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ వెటర్నరీ సైన్స్ రాజేంద్ర నగర్ హైదరాబాద్ లో చదువు పూర్తి చేశారు.మొదటి సారిగా 2005 సవత్సరంలో ఉద్యోగ బాధ్యతలు వాజేడు మండలం వెంకటాపురం రెండు సవత్సరాలు విధులు నిర్వహించి,బదిలీ పై అశ్వరావుపేట వినాయక పురంలో రెండు సవత్సరాలు దిగ్విజయంగా పనిచేసారు.ఆ తర్వాత తిరుమలాయపాలెం లో తొమ్మిది సంవత్సరాలు పశు వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తూ పలు గ్రామాలలో రైతుల మన్ననలు పొందారు.సాధారణ బదిలీలలో భాగంగా ఖమ్మం రూరల్ మండలం ఎం. వెంకటాయాపాలెంకూ పశు వైద్యాధికారీగా 2018 జూన్ లో బాధ్యతలు స్వీకరించి సేవలు అందిస్తున్నారు.మండలం లోని 20 గ్రామ పంచాయతీల రైతులకు సేవలుచేస్తూ అండగా వుంటున్నారు.

**అనునిత్యం రైతులతోనే మమైకం..**

పశువులకు ఏ సమయంలోనైనా అనారోగ్యం కలిగితే వెంటనే స్పందిస్తూ, గ్రామాలకు వెళ్లి చికిత్స అందించడం ఆయన ప్రత్యేకతగా నిలుస్తుంది.అర్ధరాత్రి సమయంలోనూ రైతుల ఫోన్ కాల్స్‌కు స్పందించి సేవలు అందించడం వల్ల రైతులు ఆయనను "మన డాక్టర్" అంటూ అభినందిస్తున్నారు. గేదెలు, ఆవులు, దూడలు, గొర్రెలకు వచ్చే వివిధ రకాల వ్యాధులను సమర్థవంతంగా గుర్తించి చికిత్స అందిస్తున్నారు.

కేవలం చికిత్స మాత్రమే కాకుండా, పశువుల సంరక్షణపై రైతులకు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. పశువులకు సమయానికి టీకాలు వేయించడం, పోషకాహారం అందించడం, వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అంటువ్యాధుల నివారణ వంటి అంశాలపై రైతులకు సూచనలు చేస్తున్నారు. దీంతో పశువుల మరణాలు తగ్గడంతో పాటు పాల ఉత్పత్తి కూడా పెరిగిందని రైతులు చెబుతున్నారు.

ప్రత్యేకంగా పేద రైతులకు తక్కువ ఖర్చుతో చికిత్స అందించడం ఆయన సేవల్లో మరో ముఖ్యాంశంగా నిలుస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో మందులు అందుబాటులో లేకపోయినా స్వయంగా సమకూర్చి చికిత్స చేయడం వల్ల రైతులు ఆయనపై విశ్వాసం పెంచుకున్నారు. కొన్ని సందర్భాల్లో తీవ్ర అనారోగ్యానికి గురైన పశువులను కాపాడి రైతులకు ఆర్థిక నష్టాన్ని తప్పించారని గ్రామలలో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో పశువైద్య సేవలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో ఇలాంటి వైద్యులు రైతులకు ఎంతో మేలు చేస్తున్నారని పలువురు రైతు సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. "పశువుల ఆరోగ్యం బాగుంటేనే రైతు కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంటుంది" అనే లక్ష్యంతో ఆయన నిరంతరం సేవలు అందిస్తున్నారని కొనియాడుతున్నారు.

**ఖమ్మం జిల్లా ఉత్తమ పశు వైద్యాధికారి అవార్డుకు ఎంపిక**

ఖమ్మం జిల్లా 2018 సంవత్సరానికి గాను ఆగస్టు 15న ఖమ్మం పెరేడ్ గ్రౌండ్ లో ఉత్తమ పశు వైద్యాధికారి అవార్డు అప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా అవార్డుని స్వీకరించారు.

**కుటుంబ నేపథ్యం**

జగ్గూ లాలు కుమారుడు ఇంటర్మీడియట్ పూర్తి చేసి నీట్ పరీక్షకు సనద్ధమవుతున్నారు.కుమార్తె ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసి స్టేట్ మూడవ ర్యాంక్ సాధించింది. భార్య బీ. సరిత జిల్లా వ్యసాయ అధికారిగా మహబూబాబాద్ జిల్లా లో విధులు నిర్వహిస్తున్నారు.

**మాది రైతు కుటుంబమే..**

**పశు వైద్యాధికారి జగ్గూ లాల్**

మాది సాధారణ మధ్యతరగతి రైతు కుటుంబం కావడంతో రైతులకు ఉండే అన్ని ఇబ్బందులు తెలుసు. అందుకే పశువుల విషయంలో ఏ ఒక్క రైతు బాధ పడకుండా వైద్యం చేయాలనే నా తపన.



## ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందాం

**కల్లూరు మే 13(జనంసాక్షి)**

2004వ సంవత్సరంలో పోరాడి సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విబిజి రాంజీ బిల్లును వ్యతిరేకిస్తూ ఈనెల 15వ తేదీన గ్రామపంచాయతీ కార్యాలయం ముందు చేపట్టిన గ్రామీణ బంద్ ధర్నాను కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక వ్యవసాయ సంఘం డివిజన్ అధ్యక్షులు తన్నీరు కృష్ణార్జునురావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పాయపూర్ గ్రామంలో ఉపాధి కూలీలను కలుసుకొని సమస్యలు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణార్జున రావ్ మాట్లాడుతూ జూలై 1 నుంచి ఉపాధి హామీ పథకంలో కొత్త విధానాన్ని అమలు చేయబోతుందని దీనివల్ల ఉపాధి కూలీలకు తీవ్రమైన నష్టం జరుగుతుందని అన్నారు. రెండు పూటలా ఫోటోలు తీసే విధానం వలన కూలీలకు ఇబ్బందిగా మారిందని అన్నారు. ఫోటోలు ఫోనులో తీసుకొని పక్షంలో కూలీలకు హాజరు పడటం లేదని, దీనివల్ల చేసిన పనికి వేతనం రాక కూలీలు నష్టపోతున్నారని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ పథకాన్ని నీరు కార్చే విధంగా ప్రయత్నిస్తున్నదని ఉపాధి పథకాన్ని రద్దు చేసే ఆలోచనలో ఉన్నదని కావున దీనిని మనం కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇప్పటికే మేట్ల వ్యవస్థను రద్దు చేశారని పని దినాలను పెంచామని చెబుతూ రోజు కూలి 300 రూపాయల నుంచి 260 రూపాయలకు తగ్గించటం దుర్మార్గమైన చర్య అని అన్నారు. పాత పద్ధతిలోనే ఉపాధి పథకాన్ని అమలు చేయాలని 200 పని దినాలు కల్పించి, రోజుకు 600 రూపాయలు కూలి ఇవ్వాలని పని ప్రదేశాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని ,పని ప్రదేశంలో కూలీలకు ప్రమాదం జరిగితే ప్రభుత్వమే వారికి పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించాలని, ఆయన డిమాండ్ చేశారు .కేంద్ర తీసుకువచ్చిన విబిజి రాంజీ బిల్లు వల్ల కార్మికులు హక్కులను కోల్పోతారని ఉపాధి భద్రత లేకుండా అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు., ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఖాజాబీ, రాంబాబు, ఉపాధి కూలీలు నాగమణి ,సరోజినీ, కోదండయ్య వెంకన్న, కస్తూరి ,సత్యనారాయణ, రమాదేవి, శ్రీను ,తదితరులు పాల్గొన్నారు.

## రైతులపై రైల్వే అధికారుల బెదిరింపులు నిలిపివేయాలి

**మధిర, మే 13 (జనంసాక్షి):**

మధిర మండలం దెందుకూరు రెవెన్యూ పరిధిలో గల రైల్వే అధికారులు పాత హద్దులు దాటి రైతుల పొలాల్లోకి ప్రవేశించి రైల్వే లైన్ పక్కన గోడ నిర్మాణం కొరకు రైతుల పొలాల్లోకి అడ్డగోలుగా హద్దులు మారుస్తూ ఉన్నారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. తమ పొలాల్లోకి ఆక్రమంగా రావడానికి వ్యతిరేకించిన రైతులను ఉద్దేశించి రైల్వే అధికారులు కేంద్ర బలగాల సహాయంతో రైతులను అరెస్టులు చేయిస్తామని జైల్లో వేయిస్తామని సంబంధిత రైల్వే అధికారులు బెదిరిస్తున్నట్లు తెలియజేశారు . తమకు పూర్తిస్థాయిలో భూమి కేటాయింపు జరిగిందని తమ పనులను అడ్డుకో రాదని సంబంధిత రెవిన్యూ శాఖ నుండి అన్ని అనుమతులు లభించాయని రైతులకు తెలియజేశారు. ఈ విషయమై స్థానిక తాసిల్దార్ ని వివరణకోరగా రైల్వేపనులకు సంబంధించిన హద్దులు కేటాయింపులు కొత్తగా ఏమి జరగలేదని రైతులు ఆందోళన చెందవద్దని తెలియజేశారు. నష్టపోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించిన తరువాతనే పనులు మొదలు పెట్టాలని సిపిఎం మధిర మండల కార్యదర్శి మందా సైదులు రైతు సంఘం మండల కార్యదర్శి మందడపు ఉపేంద్ర రావుఅధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రైతులు చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలోచావా వెంకటేశ్వర రావు గుర్రం వెంకట్రావు ఓట్ల శంకర్రావు అద్దంకి భాస్కరరావు యడ్లపల్లి వెంకటేశ్వరరావు యడ్లపల్లి నరసింహారావు యడ్లపల్లి శ్రీనివాసరావు చెరుకూరి చంద్రరావు ఐతం కృష్ణారావు ఐతం వెంకటేశ్వరరావు ఓట్ల రఘుబాబు మాదాల శరత్ చుంచు విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## సేంద్రియ వ్యవసాయ నిదానంపై రైతులుదృష్టి సారించాలి

**○మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్**

**○ఆయిల్ పామ్ తోటలతో రైతులకు సుస్థిర ఆదాయం**

**○ఏఎంసీ చైర్ పర్సన్ బాగా నీరజా దేవి**

**కల్లూరు మే 13(జనంసాక్షి)..**

వ్యవసాయ పంటల సాగులో భూసారాన్ని కాపాడుతూ అగ్రికల్చర్ అధికారుల సూచనల మేరకు ఆధునిక యాజమాన్య పద్ధతులు పాటిస్తూ ఆరోగ్యకరమైన పంటలు పండించేందుకుగాను రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పై దృష్టి సారించాలని కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ రైతులను కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల అశ్వరావుపేట శాస్త్రవేత్తలు డా. ఎ. శ్రీజన్డా. టి. శ్రవన్ , మండల అగ్రికల్చరల్ ఆఫీసర్ మాదాభత్తుల రూప ఆధ్వర్యంలో కల్లూరు పట్టణంలో గల రైతువేదికలోరైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజా దేవి గ మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విశిష్ట అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం, సిఫారసు చేసిన మేరకు ఎరువుల యాజమాన్యం, పంట మార్పిడి, సాగునీటి ఆదా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రైతులను కోరారు. రైతులు పంట మార్పిడి పాటించాలని వరి పంట యొక్క విస్తీర్ణాన్ని తగ్గించాలని ఆయిల్ పామ్ పంట సాగును పెంచాల్సిన అవసరం చాలా ఉందని రైతులకు సూచించారు. వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట శాస్త్రవేత్త డా. ఎ. శ్రీజన్ మాట్లాడుతూ అన్నదాతలు వ్యవసాయ శాఖ సూచించే ముఖ్య అంశాలపై దృష్టి సారించి, రాబోయే వానాకాల పంట సాగుకు సమాయత్తం కావాలని సూచించారు. మార్కెట్లో గిరాకీ ఉన్న వరిరకాలతో పంటలను సాగు చేయడం ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు.



అలాగే వివిధ పంటల్లో చీడపీడల యాజమాన్యం గురించి రైతులకు వివరిస్తూ తగు సూచనలు అందించారు. డా. టి. శ్రవన్ సేంద్రియ వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. రైతులు శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ వ్యవసాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఎస్. కోటేశ్వరి వ్యవసాయ అధికారి మాదాబత్తుల రూప, కౌన్సిలర్లు యాసనాగమణి , ఉబ్బన రాంబాబు ఎన్. ఉష, ఉప సర్పంచ్, ఎఇవోలు దీపిక, రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరుతో పాటు ఆరు గ్యారెంటీలు అమలుచేయాలి

**తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా..**

**బూర్గంపహాడ్ మే 13 (జనంసాక్షి)**

అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మచ్చా వెంకటేశ్వర్లు, రేపాకుల శ్రీనివాస్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్ లో వ్యవసాయ కార్మికులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండవ విడత మంజూరు చేసే ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదలకే ఇవ్వాలని, ఇంటి స్థలం లేని నిరుపేదలకు స్థలాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ. 12వేల చొప్పున తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీని పూర్తిస్థాయిలో అమలుచేయాలని, కేంద్రం ఏకపక్షంగా తీసుకువచ్చిన వీబీజీరామ్జి చట్టాన్ని రద్దుచేయాలని, మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో 15న దేశవ్యాప్తంగా ఉపాధి కార్మికుల సమ్మె జరుగుతుందని తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్కు అందజేశారు. దీనికి స్పందించిన తహశీల్దార్ కేఆర్కే ప్రసాద్ పేదల సమస్యలపై ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన పేదలకు న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్కే. అబీద, బయ్యా రాము, మరియమ్మ, చిన్నమ్మాయి, పద్మ, కనకదుర్గ, కుర్సా తిరుపతయ్య, మంగ, మీనా, శివ తదితరులు పాల్గొన్నారు.




## రైతుల సమస్యపై జరిగిన ధర్నాలో మాజీ ఎంఎల్ఏ సండ్ర

**○రైతుల పక్షాన పోరాటమే లక్ష్యంగా సండ్ర**

**○కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర ఆగ్రహం**

**○తహసిల్దార్ వీరభద్ర నాయక్ కు మెమోరాండం**

**పెనుబల్లి, మే 13 (జనంసాక్షి)**

ఖమ్మం జిల్లా పెనుబల్లి తహసిల్దార్ కార్యాలయం ముందు బుదవారం ధాన్యం కొనుగోలు, రైతు సమస్యలపై మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొని మాట్లాడారు. రైతాంగాన్ని ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సండ్ర మండిపడ్డారు. వరి, మొక్కజొన్న కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యంపై రైతులతో కలిసి ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శించారు. మార్చి నెలలోనే వరికోతలు ప్రారంభమైనప్పటికీ, రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు, బీఆర్ఎస్ పార్టీ ధర్నాలు చేపట్టిన తర్వాతే హడావుడిగా కొనుగోళు ప్రారంభించిందన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ రైతులు పడుతున్న బాధలను తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం సకాలంలో కొనుగోళ్లు చేపట్టకపోవడంతో 70 శాతం వరి ప్రైవేట్ మిల్లర్లకు అమ్ముకోవాల్సి వచ్చిందని, మిల్లర్లు బస్తాకు 12 కేజీల వరకు తాలు తీసి రైతులను దోచుకుంటున్నారని మండి పడ్డారు. మొక్కజొన్న కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు క్వింటాకు రూ. 800 వరకు నష్టపోతున్నారని తెలిపారు. రైతు భరోసా, గన్ని బ్యాగులు, కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో రాజకీయ జోక్యం పెరిగిపోయిందని, బస్తాలు ఇవ్వాలన్నా, కాంట వేయాలన్నా పార్టీలు చూస్తున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. కేసీఆర్ హయాంలో రాజకీయాలకు అతీతంగా ప్రతి గింజ కొనుగోలు చేసి రైతాంగానికి అండగా నిలిచామని గుర్తు చేశారు. అనంతరం సండ్ర బి ఆర్ ఎస్ నాయకులతో కలిసి తహసిల్దార్ వీరభద్ర నాయక్ కు మెమోరాండం అందజేశారు. ఐకేపీ ఏపీఎంను కలిసి గత 50 రోజులుగా ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సత్తుపల్లి మునిసిపల్ చైర్మన్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వర్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ హరికృష్ణ రెడ్డి, మాజీ జెడ్పిటి సి చెక్కిలాల మోహన్ రావు, కల్లూరు ఏఎంసీ మాజీ చైర్మన్ చెక్కిలాలలక్ష్మణరావు, బి ఆర్ ఎస్ నాయకులు కోటగిరి సుధాకర్ బాబు, పెనుబల్లి సర్పంచ్ బాణోత్ పాప, తాళ్లపెంట సర్పంచ్ నార పోగు శారద, లక్కినేని అలేఖ్య వినీల్, మందడపు అశోక్ కుమార్, నీలాద్రి బాబు, టీవీ రామారావు,కోటా ప్రభాకర్, కాకా సీతారాములు, చింత నిప్పు శ్రీనివాసరావు వంగా చిన్న పండు, వేముల సురేష్, వెలివెల పుల్లయ్య, ఏటుకూరి చిన్నబాబు, గోదా చెన్నారావు, తదితరులు పాల్గొన్నారు.



# విద్యాభివృద్ధి తోనే భవిష్యత్తు

**• మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్**



**హుజూర్ నగర్, (జనంసాక్షి):**
ప్రభుత్వ పాఠశాలలో అందించే నాణ్యమైన విద్యను, సౌకర్యాలను వినియోగించుకొని తెలంగాణ సమాజం సుందరంగా నిర్మించడంలో సర్పంచులు క్రియాశీలకంగా వ్యవహరించాలని హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున రావు అన్నారు. హుజూర్ నగర్ లో బుధవారం విద్యాశాఖ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సర్పంచులు, వార్డు కౌన్సిలర్ల కార్యశాలను వారు ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా విద్యారంగాన్ని సమూలంగా మార్చాలన్న ఆశయంతో ఈ విద్యా సంవత్సరం నుంచి 100 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల లో సౌకర్యాలు కల్పించడంలోనూ, విద్యార్థులను బడిలో చేర్పించడం లోనూ సర్పంచులు ముందు వరుసలో ఉండి ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తయారు చేయాలని వారు పిలుపునిచ్చారు. హుజూర్ నగర్ మండల విద్యాధికారి సైదా నాయక్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ రాబోయే నెల రోజులపాటు సాగనున్న బడిబాట కార్యక్రమం ద్వారా బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాధికా దేశ్ ముఖ్, సూర్యాపేట జిల్లా సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు గుండు రామాంజిగౌడ్, మండల విద్యాధికారులు భూక్యా సైదా నాయక్,ఛత్రు నాయక్, వెంకటాచారి, కాటయ్య, బాలు నాయక్, శ్రీనివాసరావు, ఫాతిమా, రిసోర్స్ పర్సన్లు కవి సత్యనారాయణ, గొట్టె శ్రీనివాస్ వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత విజయాలు సాధించాలి

**●ఎస్ఎస్సి టాపర్స్‌కు శ్రీ వశిష్ట విద్యాసంస్థల ఘన సన్మానం**



**హుజూర్‌నగర్, (జనంసాక్షి):**
విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత విజయాలు సాధించాలని శ్రీ వశిష్ట విద్యాసంస్థల చైర్మన్ లింగమనేని ప్రమీలారాణి అన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, పోటీ సామర్థ్యాలను పెంపొందిస్తూ ఐఐటీ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో విశేష ఫలితాలు సాధిస్తున్న శ్రీ వశిష్ట విద్యాసంస్థలు మరోసారి విద్యార్థుల ప్రశంసలను అందుకుంటున్నాయి. బుధవారం శ్రీ వశిష్ట విద్యాసంస్థల చైర్మన్ లింగమనేని ప్రమీలారాణి రూపకల్పన చేసిన ప్రత్యేక విద్యా విధానాన్ని జీఎం వంశీ చంద్ర, డీన్ శ్రీనివాస్ సమర్థవంతంగా అమలు చేస్తున్న తీరు ఆకట్టుకోవడంతో పలువురు స్కూల్ టాపర్స్ శ్రీ వశిష్ట జూనియర్ కాలేజీలో చేరుతున్నారు. ఈ సందర్భంగా కాకతీయ స్కూల్స్ హుజూర్‌నగర్‌కు చెందిన ఎస్ఎస్సి టాపర్స్ బండి వైష్ణవి (576 మార్కులు), రిత్విక్ రెడ్డి (575 మార్కులు) సాధించడంతో ఘనంగా సన్మానించారు. టాపర్స్‌తో పాటు వారి తల్లిదండ్రులు, కాకతీయ స్కూల్స్ చైర్మన్, ప్రిన్సిపల్‌లను కూడా ప్రత్యేకంగా అభినందించారు. నేరేడుచర్ల ప్రాంతానికి చెందిన పలువురు స్కూల్ టాపర్స్ కూడా శ్రీ వశిష్ట జూనియర్ కాలేజీలో చేరడం ఆనందదాయకమని నిర్వాహకులు పేర్కొన్నారు. విద్యార్థులు మంచి ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. హుజూర్‌నగర్ ఇంచార్జ్ మట్టపల్లి రవీందర్ సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీ వశిష్ట విద్యాసంస్థల అసోసియేట్ డీన్ అనూప్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపల్ మట్టపల్లి రవీందర్ పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు ఈ-కేవైసీపై అవగాహన



**బూర్గంపహాడ్ మే 13 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం లో ఉపాధి హామీ కూలీలకు ఎంపీడీవో జమలారెడ్డి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. బుధవారం మండల కేంద్రం బూర్గంపహాడ్లో ఈజీఎస్ ఏపీవో విజయలక్ష్మితో కలిసి ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేశారు. జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ-కేవైసీ చేయించుకోవాలని, లేనిపక్షంలో జాబ్కార్డులో పేర్లు తొలిగిపోతాయని కూలీలకు వివరించారు. జాబ్కార్డు కలిగి ఉన్న వ్యక్తులు మాత్రమే పనులకు వచ్చేలా చూడటానికి, ఆధార్తో అనుసంధానం చేయడం ద్వారా ఈ-కేవైసీ సేకరిస్తున్నట్లు తెలిపారు. ఉపాధిహామీ కూలీలు తమ సమీపంలోని గ్రామపంచాయతీ లేదా ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా ఈకేవైసీ అప్డేట్ చేయించుకోవాలని సూచించారు. ఈకేవైసీ లేని కూలీలకు పనులు చేసినా వేతనాలు రావని, ఇందుకోసం ఉపాధికూలీలు తప్పకుండా ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మందా నాగరాజు, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.

### హెచ్ సి ఏ టుడే లాగ్ టీం కి ఎంపికైన
# చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ క్రీడాకారులు



**భద్రాచలం మే 13 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- జిల్లాకు చెందిన భద్రాచలం చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ క్రికెట్ క్రీడాకారులు హెచ్‌సిఏ టుడే లీగ్ జట్టుకు ఎంపిక కావడం ఖమ్మం జిల్లాకు ఎంపికయ్యారు. అకాడమీకి? చెందిన రత్నా ఆరియన్, ప్రసన్న కుమార్, హర్ష వర్ధన్ నాయుడు, సుహాస్ తమ ప్రతిభతో హెచ్‌సిఏ టుడే లీగ్ క్రికెట్ టీమ్‌లో చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ కోచ్ లు చరణ్ తేజ, రవితేజ మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణ పట్టుదల నిరంతర సాధనతో ఈ స్థాయికి చేరుకున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసి ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ నలుగురు క్రీడాకారులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారుల ఎంపికపై ఖమ్మం జిల్లా క్రీడాభిమానులు, తల్లిదండ్రులు, అకాడమీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# చెరువులను కాపాడండి..భవిష్యత్ తరాలకు నీరు నిల్వచేయండి

**●తెలంగాణ ప్రభుత్వానికి నల్లగొండ అరోరా లా కాలేజ్ విద్యార్థి నక్క శ్రీనివాస్ అత్యవసర ఫిర్యాదు**

**●భూగర్భ జలాల సంక్షోభానికి చెరువుల ఆక్రమణలే కారణం**

**పాలక వీడు ( జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్రంలోని చెరువులు, కుంటలు మరియు ప్రభుత్వ జల వనరులపై జరుగుతున్న ఆక్రమణలను అరికట్టాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హైడ్రా కమిషనర్, రెవెన్యూ శాఖ, ఇరిగేషన్ ఊ సి ఏ డి శాఖ, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మరియు తెలంగాణ హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీకి బుధవారం పాలకీడు మండలం శూన్యపహాడ్ గ్రామానికి చెందిన నల్లగొండ అరోరా లా కాలేజ్ విద్యార్థి నక్క శ్రీనివాస్ అత్యవసర ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు వ్యక్తిగత ప్రయోజనం కోసం కాకుండా, తెలంగాణ రాష్ట్ర ప్రజల భవిష్యత్ నీటి భద్రత, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రభుత్వ జల వనరుల సంరక్షణ దృష్ట్యా ప్రజాప్రయోజన అంశంగా సమర్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఫిర్యాదులో తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ జీవన విధానానికి ప్రాణాధారమైన చెరువులు, కుంటలు, వాగులు మరియు ఇతర జల వనరులు రోజురోజుకు అక్రమ ఆక్రమణలకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువులు కేవలం నీటి నిల్వ కేంద్రాలు మాత్రమే కాకుండా భూగర్భ జలాల పునరుత్పత్తి, వర్షపు నీటి నిల్వ, పశువులు?పక్షులు?వన్యప్రాణుల జీవనాధారం మరియు గ్రామీణ పర్యావరణ పరిరక్షణకు కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఆక్రమణల వల్ల భూగర్భ జలాలు తగ్గిపోవడం, రైతులు సాగునీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కోవడం, పశువులు మరియు వన్యప్రాణులకు తాగునీటి సమస్యలు ఏర్పడడం, వర్షాకాలంలో వరద ముప్పు పెరగడం వంటి తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ భూములు అక్రమంగా వ్యక్తుల ఆధీనంలోకి వెళ్తుండడం వల్ల భవిష్యత్ తరాలకు తీవ్రమైన నీటి సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ ప్రధాన లక్ష్యం చెరువుల పునరుద్ధరణ మరియు పరిరక్షణ అయినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో అధికారుల నిర్లక్ష్యం మరియు స్థానిక ప్రభావశీలుల జోక్యంతో చెరువుల ఈఊ (ఈబీశ్రీశ్రీ ఎజీనిని ఒవలవశ్రీ) మరియు బఫర్ జోన్ ప్రాంతాలు ఆక్రమణకు గురవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చెరువులపై ప్రత్యేక సర్వే నిర్వహించడం, ఎఫ్ టి ఎల్ మరియు బఫర్ జోన్‌లను అధికారికంగా గుర్తించడం, ఆక్రమణలను తొలగించడం, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవడం, ప్రతి జిల్లాలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయడం, డ్రోన్ సర్వే మరియు జి ఐ ఎస్ మ్యాపింగ్ ద్వారా చెరువుల సరిహద్దులను డిజిటల్ రికార్డులుగా భద్రపరచడం వంటి పలు కీలక డిమాండ్లను ఆయన ప్రభుత్వానికి సూచించారు. .అదేవిధంగా గ్రామ స్థాయిలో చెరువుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, జల వనరుల రక్షణ కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ మరియు ఫిర్యాదు వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు.



# చేనేత కళాకారులకు మెగా ఆరోగ్య ఉచిత వైద్య శిబిరం



**సంస్థాన్ నారాయణపురం. మే 13. ( జనంసాక్షి):** సంస్థాన్ నారాయనపురం మండలం లోని పుట్టపక గ్రామంలో కలెక్టర్ జౌళిశాఖ వైద్య అధికారుల ఆదేశాల మేరకు చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కళాకారులకు ఆరోగ్య పరిరక్షణ కోసం చేనేత కళాకారులకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరన్నీ డిఎం ౘ హెచ్ఓ మనోహర్ సర్పంచ్ గజం అనిత సత్యనారాయణ వైద్య అధికారులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో జనరల్ ఫిజీషియన్ కంటి వైద్యనిపుణుల ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. చేనేత కార్మికులకు కంటి సమస్యలు ఆరోగ్య సమస్యలు పై కార్మికులకు ప్రభుత్వం కార్మికుల వద్దకే మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించడాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.సుమన్ కళ్యాణ్, డాక్టర్రవీనా, డాక్టర్ జోష్ణ, సూపర్వైజర్స్, ఏఎన్ఎంలు ,డివో రాజేశ్వర్ రెడ్డి, సిడి రమాకాంత్, మల్లికార్జున్, సోనీ, రాజేశ్వరి, ఆశాలు, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

**పెన్ పహాడ్, మే 13 (జనంసాక్షి) :**

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చిన్న సీతారాం తండా గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన బానోతు దస్రు, వయస్సు:45 సం.లు అను అతను మిని బోర్ వెల్, కొనుగోలు చేసి దానిని నడపడానికి సుమారు 5 లక్షల అప్పులు చేశాడు, అట్టి అప్పులు తీర్చలేక తీవ్ర మనోవేదనకు గురై తేది: 08-05-2026 మధ్య రాత్రి సుమారు 10.45 గంటల సమయంన తన ఇంటిలో ఉన్న పురుగుల మందు తాగి తన బార్య అయిన కమ్మ కు చెప్పగా వెంటనే అతనిని సూర్యాపేట ఏరియా హాస్పిటల్ కు తరలించగా చికిత్స పొందుతూ తేది: 13.05.2026 బుధవారంరోజున తెల్లవారు జామున మృతిచెందినట్లు తెలిపారు. మృతుని కుమారుడు బానోతు సాయి పిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలి

సూర్యాపేట(జనంసాక్షి):

జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి వారి దేవాలయ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర పర్యటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు.బుధవారం వెంకటేశ్వర స్వామి వారి దేవాలయ అభివృద్ధి నూతన కమిటీ సభ్యులు బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో నూతన కమిటీ సభ్యులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలని అన్నారు.పదవులను న్యాయబద్ధంగా, బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు.అనంతరం నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ గట్టు శ్రీనివాస్, దండ అరవింద్ రెడ్డి, ధరవత్ ధర్మ నాయక్, ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు,ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దేవరశెట్టి రవిశంకర్, అప్పలచార్యులు, పోతుగంటి వెంకటేశ్వర్లు, నకిరేకంటి భరత్ కుమార్, మనసాని నాగేశ్వరరావు, భారతి, చీదెళ్ల పర్వతాలు, చల్లా పాండయ్య, భువనగిరి వెంకన్న, మర్ల కరుణాకర్ రెడ్డి, లక్ష్మీకాంత్, పిల్లల భవాని, గుండె కృష్ణ, తెడ్ల పల్లవి తదితరులు పాల్గొన్నారు.



# వ్యాపారాలకు అనుకూలంగా గ్రామపంచాయతీ సముదాయాలు

## సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి

**కొండమల్లేపల్లి, మే 13 (జనంసాక్షి):**

కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ జేబీ రోడ్డులోని నాలుగు వ్యాపార సముదాయాలను సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి గ్రామపంచాయతీ పాలకవర్గంతో కలిసి నూతనంగా ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేబీ రోడ్డులోని వ్యాపార సముదాయాలు వ్యాపారాలకు అనుకూలంగా ఉంటాయన్నారు. చిన్న మధ్యతర వ్యాపారస్తులు గ్రామపంచాయతీ వ్యాపార సముదాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవరికైనా వ్యాపార సముదాయాలు కావాలంటే గ్రామపంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. వారివెంట గ్రామపంచాయతీ సెక్రటరీ డాకు నాయక్, వార్డు సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు ఉన్నారు.

# హుజూర్ నగర్ సబ్ ఇన్స్పెక్టర్ గా నరేష్ బాధ్యతల స్వీకరణ

**హుజూర్ నగర్, (జనంసాక్షి):**



హుజూర్ నగర్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ గా చలికంటి నరేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హుజూర్ నగర్ పోలీస్ స్టేషన్లో ఎస్సైగా చేసిన బండి మోహన్ బాబు సూర్యాపేట వి ఆర్ కు బదిలీ అయ్యారు. గరిడేపల్లి నుండి ఎస్సై నరేష్ బదిలీ పై హుజూర్ నగర్ పోలీస్ స్టేషన్ కు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణ కు ప్రాధాన్యత ఇస్తానని, డ్రగ్స్, గంజాయి, అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

# బ్రీత్ మౌంటెన్ రీ ట్రీట్ సెంటర్ లో చిన్నారులకు వేసవి శిబిరం



**సంస్థాన్ నారాయణపురం. మే 13. ( జనంసాక్షి):**

సంస్థాన్ నారాయణపురం మండలంలోని రాచకొండ గుట్టల మధ్యనున్న బ్రీత్ మౌంటెన్ రీ ట్రీట్ సెంటర్ అరబిందో ఆశ్రమంలో చిన్నారులకు వేసవి శిబిరం బుధవారం ప్రారంభించారు. సిద్ధ సమాధి యోగ ఆచార్యులు రవీందర్ బాపూజీ ఆధ్వర్యంలో కిషోరా సిద్ధ సమాధి యోగ శిక్షణ నిచ్చేందుకు అర్ధమండలం 21 రోజుల శిక్షణా శిబిరాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. 10 నుంచి 16 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలకు ఈ శిబిరంలో ఆచార్య సౌజన్య లక్ష్మి మాతాజీ ఆధ్వర్యంలో పలు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ప్రశాంతమైన ప్రకృతి మధ్యన శిబిరంలో పాల్గొన్న చిన్నారులను తెల్లవారుజామున 4:30కే నిద్రలేపి సూక్ష్మ వ్యాయామాలు ధ్యానం యోగ సాధనలో శిక్షణ ఇస్తున్నారు. సేంద్రీయ పద్ధతిలో పండించిన పదార్థాలతో అల్పాహారం భోజనం అందిస్తున్నారు. తాము తిన్న పల్లెలను తామే శుభ్రం చేసేలా అందరితో నేలపై సహపంక్తి భోజనం చేసేలా శిక్షణ ఇస్తున్నారు.చుట్టూ ఉన్న గుట్టలపై ట్రెక్కింగ్ చేయిస్తున్నారు. స్వచ్ఛమైన ప్రాణవాయువును పీలుస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ అడవిలో కాలిబాటన నడిపిస్తున్నారు. సెల్ ఫోను టీవీ తెరలకు అలవాటు పడకుండా కథలు చెబుతున్నారు పాటలు పాడిస్తున్నారు ఆటలు ఆడిస్తున్నారు సనాతన ధర్మం గురించి వివరిస్తున్నారు భగవద్గీత శ్లోకాలను కంఠస్థం చేయిస్తున్నారు. 21 రోజుల శిక్షణలో పిల్లలను అంతర్గతంగా శుద్ధి చేసే కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు శిబిరం నిర్వాహకుడు రవీందర్ బాపూజీ తెలిపారు. బ్రీత్ అరబిందో ఆశ్రమం వ్యవస్థాపకుడు అరవింద్ రెడ్డి, మేనేజర్ సలాం ఆజాదులు సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



# ధాన్యాన్ని మిల్లులకు త్వరగతిన తరలించాలి

## - లారీల కొరత సృష్టిస్తే కాంట్రాక్టర్ పై చర్యలు తప్పవు

**పి.ఏ.పల్లి,బుధవారం 13(జనంసాక్షి ):**

దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్,జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు పి.ఏ.పల్లి,గుడిపల్లి మండలాల యందు ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల యందు లారీల కొరత, ధాన్యం కొనుగోలులో ఇబ్బందుల దృష్ట్యా దేవరకొండ ఆర్డీఓ రమణా రెడ్డి అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని కాంటా వేసి త్వరగతిన మిల్లులకు తరలించాలని ఐకేపీ సెంటర్ నిర్వాహకులకు సూచించారు.లారీల కొరత సృష్టిస్తే కాంట్రాక్టర్,లారీల యాజమాన్యం పై చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో అంగడిపేట సర్పంచ్ రమావత్ చిరంజీవి,వివిధ శాఖల సంబంధిత అధికారులు,నాయకులు ఉన్నారు.

# లయన్స్ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం

## 30 మంది వికలాంగులకు వీల్ చైర్ల పంపిణీ



భూదాన్ పోచంపల్లి, మే 13 (జనం సాక్షి):

పట్టణ కేంద్రంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో, పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో 30 మంది వికలాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. సమాజ సేవే లక్ష్యంగా లయన్స్ క్లబ్ సభ్యులు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించి అవసరమైన వారికి సహాయం అందించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, జిఏటి ఏరియా లీడర్ గోపాల్ రావు ఆవుల, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మదన్మోహన్ రేపాల, డిస్ట్రిక్ట్ గవర్నర్ (ఇ) కె.వి. ప్రసాద్, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ (ఇ) సతీష్ కుమార్ కోడె, జోన్ చైర్మన్ డాక్టర్ ఝాన్సీ రాణి పసలపూడి హాజరై లబ్ధిదారులకు వీల్ చైర్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో సహాయం అవసరమైన వారికి తోడ్పాటు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అనేక మందికి ఉపయోగపడుతున్నాయని తెలిపారు. వీల్ చైర్లు అందుకున్న వికలాంగులు లయన్స్ క్లబ్‌కు, సహకారం అందించిన ఐసీఎం ప్రెసిడెంట్ జెస్సీ పాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పోచంపల్లి అధ్యక్షులు ముస్కూరి నరసింహ, ప్రధాన కార్యదర్శి రాపోలు వేణు, కోశాధికారి కర్నాటి నరసింహ, మంగళపల్లి రమేష్, గంజి బాలరాజు, డాక్టర్ సీత భాస్కర్, దుద్యాల రామకృష్ణ, ఏలే హరీష్ శంకర్, కూరపాటి స్వామి, బండారు లక్ష్మయ్య, రచ్చ భాస్కర్, బోద్దుల పాండు, భోగ రమేష్, గడ్డం నవీన్, సంఘం నవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే ప్రభుత్వ ఉద్దేశం

## ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి



**యాదాద్రి,కరస్పాండెంట్ మే 13 (జనంసాక్షి)**
నాణ్యమైన బోధన మెరుగైన మౌలిక సదుపాయాలు, డిజిటల్ లెర్నింగ్, విద్యార్థుల సంక్షేమం మరియు సమాజ భాగస్వామ్యం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో విద్యా వారోత్సవాల్లో భాగంగా నియోజకవర్గ స్థాయి లో మున్సిపల్ చైర్మన్, సర్పంచ్, వార్డు మెంబర్ లకు వర్క్ షాప్ నిర్వహించి, విద్యా శాఖ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమ్మం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం రోజుకొక కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్ పనులను పూర్తి చేసుకుని అభివృద్ధి పథంలో ముందుండేలా ప్రజా ప్రభుత్వం విద్య పై ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద జిల్లాలో పాఠశాలల లోని మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్స్, అదనపు తరగతి గదులు, తదితర మరమ్మత్తులు చేసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత నిస్తూ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, కిచెన్ షెడ్, సోలార్ ఫెన్సింగ్, తదితర పెండింగ్ పనులు పూర్తి చేసుకోవడం జరుగుతుందన్నారు. ఎస్సీ ,ఎస్టీ, బీసీ ,మైనారిటీ హాస్టల్స్ లో ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఇంటర్నేషనల్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు మెరుగుపరచడం జరుగుతుందని అందులో భాగంగా ప్రతి పేద విద్యార్థి మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగేలా అన్ని సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. నియోజకవర్గ స్థాయిలో కూడా పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందన్నారు.విద్యతోఏదైనా సాధ్యం అవుతుందనీ, ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించింది ప్రభుత్వ పాఠశాలలకు అనేక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని 40 శాతం మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జెస్ పెంచడం జరిగిందని అందులో భాగంగా విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి రుచికరమైన భోజనం అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న వసతుల పై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం పెరిగిందన్నారు. జూన్ 2 నుండి ప్రీ- ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థులందరికీ ఉదయానే అల్పాహారం, పాలు, జావ వంటివి అందించడం జరుగుతుందని తదనుగుణంగా విద్యార్థుల్లో సృజనాత్మకత మెరుగుపడుతుందని అన్నారు. గతంలో పోలిస్తే ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిందని అన్నారు. జిల్లాలో పదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటుకు దీటుగా ఉత్తీర్ణత ఫలితాలు విద్యార్థులు సాధించారన్నారు. అందుకు గాను ప్రభుత్వ పాఠశాలల్లో అద్భుతమైన ఉపాధ్యాయులు ఉన్నారని వారిని కొనియాడారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో పదవ తరగతి పరీక్షలలో మంచి మార్కులు వచ్చాయని, గ్రామాలలో ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా చూడాలని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా, ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక వసతుల సదుపాయాలు, మంచి వాతావరణంలో స్కూల్స్ ఉన్నాయన్నారు. ప్రభుత్వం విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని అల్పాహారం, రాగి జావా, మధ్యాహ్నం భోజనంలో మంచి పౌష్టికాహారం అందించడం జరుగుతుందని అన్నారు. ఇంటర్మీడియట్ లో కూడా వచ్చే విద్యా సంవత్సరం నుండి మధ్యాహ్నం భోజన పథకం అమలు చేయడం తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ లోఒకే ప్రాంగణంలో ప్రీ -ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యా ను అందించడం జరుగుతుందని,ఆధునిక వసతులు, క్రీడా ప్రాంగణాలు , సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికివేదికలుగా మారుతున్నాయని అన్నారు. జిల్లాలో జనాభా గణన జరుగుతుందని, జిల్లా ప్రజలందరూ ఎన్యుమరేటర్లకు సహకరించాలని , ఈ డాటా వలన ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి బిఅందుతాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను ఎక్కువ మొత్తంలో చేర్పించేందుకు కృషి చేయాలి అన్నారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా 11 నుండి 17 వరకు విద్యా వారోత్సవాలు జరుగుతుందని అన్నారు. విద్యార్థులు ప్రవేట్ పాఠశాలకు వెళ్లకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగాస్థానిక ప్రజా ప్రతినిధులు చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో శోభారాణి, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, మండల ఎడ్యుకేషన్ అధికారులు, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు కొప్పుల వెంకటరెడ్డి, భువనగిరి మున్సిపల్ చైర్మన్ శ్రీ వాణి, వైస్ చైర్మన్ మంజుల, ఆలేరు మున్సిపల్ చైర్ పర్సన్ బాలామణి, సర్పంచులు, కౌన్సిలర్లు సంబధిత అధికారులు పాల్గొన్నారు.



## ఉచిత కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

### కుట్టు,బ్యూటీ పార్లర్ శిక్షణ కేంద్రం ప్రారంభించిన కుంభం కీర్తి రెడ్డి

**బీబీనగర్ (జనంసాక్షి):**



ఉచిత కుట్టు, బ్యూటీ పార్లర్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు పొందాలని కుంభం పౌండేషన్ చైర్మన్ కుంభం కీర్తి రెడ్డి అన్నారు. మండలంలోని రాయరావుపేట గ్రామంలో గ్రామ సర్పంచ్ బొర్ర రమేష్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు, బ్యూటీ పార్లర్ శిక్షణ శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా బలోపేతం కావడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు గోలి పింగల్ రెడ్డి15 వేలు, మాజీ ఎంపీటీసీ మన్నె బాల్ రాజు10 వేల రూపాయలను కుట్టు మిషన్లకు తమవంతు సహకారంగా మహిళలకు ఇచ్చేందుకు ముందుకు రాగా వారికి సర్పంచ్ బొర్ర రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోలి పింగల్ రెడ్డి, పొట్టోళ్ల శ్యామ్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ బొర్ర సంతోష, మాజీ ఎంపిటిసి మన్నె బాలరాజు, మాజీ సర్పంచ్ కొమ్మిడి సుభాష్ రెడ్డి, బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు రంగోల్ల సతీష్, రంగోల్ల వంశీ, ఉప సర్పంచ్ యర్కల శివ నాగరాజు గౌడ్, వార్డు సభ్యులు పాండాల వేదన హరిబాబు, బొర్ర సత్యలక్ష్మి వెంకటేష్, తిప్పర బోయిన జంగమ్మ జంగయ్య, ఎర్రంపల్లి ప్రకాష్, రొంపి ఆనంద్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు రంగోల్ల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ బొర్ర గండయ్య, మాజీ ఉపసర్పంచ్ యర్కల ఎల్లయ్య గౌడ్, దేవస్థానం కమిటీ చైర్మన్ నవీన్ గుప్తా, మహిళా సంఘం అధ్యక్షురాలు యర్కల జ్యోతి, నాయకులు యర్కల సుదర్శన్ గౌడ్, తల్లెం సురేష్, గడ్డమీది సత్యనారాయణ, రొంపి పోశయ్య, నరసింహ్మ,యర్కల అంజయ్య, కలకొండ జయప్రకాష్, పాండాల సురేష్, బుర్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్రంపోడు మండలం ఉచిత టైక్వాండో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

**గుర్రంపోడు మే 13 (జనంసాక్షి)**



నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం మోసంగి గ్రామంలో విద్యార్థులకు ఉచిత టైక్వాండో వేసవి ప్రత్యేక శిక్షణ శిబిరం (సమ్మర్ స్పెషల్ ఉచిత క్యాంపు) ఘనంగా ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు, వారి శారీరక, మానసిక దృఢత్వానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.గ్రామ సర్పంచ్ పిల్లి ఉమారాణి అభినయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఉచిత శిక్షణా శిబిరాన్ని టైక్వాండో జిల్లా జనరల్ సెక్రెటరీ అనిల్ కుమార్, సర్పంచ్ పిల్లి ఉమారాణి అభినయ్ తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఇలాంటి క్రీడల్లో రాణించాలన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కోట్ల శ్రీనాథ్, వార్డు సభ్యులు నిరసన మెట్ల లవ కుమార్, మాదాసు శ్రీకాంత్, నిరసన మెట్ల సందీప్, బడుగుల శ్రీనివాస్, నిరసనమట్ల బాలయ్య, కాంచని చంటి, గోవు నాగరాజు, నిరసన మెట్ల సంతోష్, నడ్డి మల్లేష్, మర్రి నాగరాజు, పిల్లి నాగరాజు పాల్గొన్నారు. వీరితో పాటు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించేందుకు విచ్చేసిన టైక్వాండో కోచ్ మనోజ్, సీనియర్ ప్లేయర్ పూర్ణ చందు, మరియు మర్రి మైసయ్య తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలో ఉచితంగా క్రీడా శిక్షణ అందిస్తున్నందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సర్పంచ్ పిల్లి ఉమారాణి అభినయ్ బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచండి

### మిల్లర్లు తరుగు పేరుతో కోత విధిస్తే కఠిన చర్యలు తప్పవు

**కోదాడ,( జనంసాక్షి):** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా ఎస్పీ కె. నరసింహతో కలిసి ఆయన మునగాల మండలంలోని బాలాజీ రైస్ మిల్, కోదాడ మండలంలోని శ్రీ వాసవి మాతా రైస్ మిల్, శ్రీ ధనలక్ష్మి పార్ బాయిల్డ్ రైస్ మిల్, అలాగే అనంతగిరి మండలంలోని పద్మావతి, వెంకటేశ్వర, మరియు లక్ష్మి రైస్ మిల్లులను సందర్శించారు. మిల్లులలో జరుగుతున్న ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియను వారు పరిశీలించారు.అనంతరం మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిని వివరించారుజిల్లాలో ఈ సీజన్‌లో4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేయగా, ప్రస్తుతం 3 లక్షల 50 వేలమెట్రిక్ టన్నుల వరకు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు 2 లక్షల 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విజయవంతంగా కొనుగోలు చేసి మిల్లులకు తరలించడం జరిగిందని తెలిపారు. మిగిలిన ధాన్యాన్ని త్వరితగతిన సేకరించి, బ్యాగింగ్ పూర్తి చేసి మిల్లులకు చేర్చేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. కోదాడ, హుజూర్ నగర్ ప్రాంతాల్లోని మిల్లులతో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి తరుగు పేరుతో కోతలు విధిస్తే సహించేది లేదని మిల్లర్లను హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకునేందుకు సివిల్ సప్లై మరియు రెవెన్యూ అధికారులతో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.కలెక్టర్ వెంట డీఎస్ఓ మోహన్ బాబు, ఆర్డీవో సూర్యనారాయణ, మునగాల తహసిల్దారు సరిత, కోదాడ తహసిల్దార్ సంతోష్ కిరణ్, అనంతగిరి తహసిల్దారు హిమబిందు మిల్లర్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.



## పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

**సూర్యాపేట (జనంసాక్షి):**సూర్యాపేటపట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష ఎన్నికల షెడ్యూల్, నియమావళి ఈ నెల 15 నుంచి అమల్లోకి వస్తుందని ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు.ఈ నెల 17న నామినేషన్లను జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో స్వీకరించబడునని తెలిపారు.అదే రోజు సాయంత్రం స్క్రూట్ని జరుగుతుందన్నారు.నామినేషన్ తో పాటు రూ.5వేలు డిపాజిట్ చేయాలని తెలిపారు.నామినేషన్ ఉప సంహరణ చేసుకున్న వారికి డిపాజిట్ వాపసు చేయబడుతుం దన్నారు. ఈ నెల 18న నామినేషన్ల ఉపసంహరణ, 31న ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.ఎన్నికల అనంతరం ఓట్ల లెక్కింపు, ఫలితాలను ప్రకటిస్తారని తెలిపారు.నేటి వరకు నూతన సభ్యత్వాలు స్వీకరించబడతాయని తెలిపారు.ఓటు వేయడానికి వచ్చేటప్పుడు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు, మాజీ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు కర్నాటి కిషన్, ఆర్యవైశ్య మహాసభ క్రమశిక్షణ సంఘం చైర్మన్ బండారు రాజా, జిల్లా కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్, పట్టణ అధ్యక్షులు మంచాల రంగయ్య, కమిటీ సభ్యులు బొమ్మిడి లక్ష్మీనారాయణ, ఈగ దయాకర్ గుప్తా, వెంపటి సురేష్, రాచర్ల కమలాకర్,గుండా శ్రీధర్, తాప్సీ గాంధీ, కొండ శ్రీనివాసరావు, వుప్పలంచు కృష్ణ, ఎన్నికల పరిశీలకులు దేవరశెట్టి జనార్ధన్ పాల్గొన్నారు.

## చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

**పెన్ పహాడ్, మే 13 (జనంసాక్షి) :**
చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చిన్న సీతారాం తండా గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన బానోతు దస్రు, వయస్సు:45 సం.లు అను అతను మిని బోర్ వెల్, కొనుగోలు చేసి దానిని నడపడానికి సుమారు 5 లక్షల అప్పులు చేశాడు, అట్టి అప్పులు తీర్చలేక తీవ్ర మనోవేదనకు గురై తేది: 08-05-2026 మద్య రాత్రి సుమారు 10.45 గంటల సమయంన తన ఇంటిలో ఉన్న పురుగుల మందు తాగి తన బార్య అయిన కమ్మ కు చెప్పగా వెంటనే అతనిని సూర్యాపేట ఏరియా హాస్పిటల్ కు తరలించగా చికిత్స పొందుతూ తేది: 13.05.2026 బుధవారంరోజున తెల్లవారు జామున మృతిచెందినట్లు తెలిపారు. మృతుని కుమారుడు బానోతు సాయి పిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.